

# కిటికీలో పూలతోట

ఎంత హాయిగా వుందీ ! ఇంతమంది మెక్కినా కాళ్లు జాపుకోడానికూడా వీలుగానే వుందీ! జీపు కూడా కుదపటల్లేదు ఇందాకట్లాగా. జీపుతో సహా కృష్ణదాటేటప్పటికే చీకటి పడిపోయింది కదా! అసలు ముందుగా బయల్దేరేవాళ్లమే ! ఈ అమ్మమ్మగారే నాలుగు వరకు వర్షమని బయల్దేరనియ్యలేదు.



కృష్ణ దాటగానే ఆ ఒడ్డునే కూచుని తెచ్చుకున్న పులిహోర కాస్తా తినేయాల్సొచ్చింది. అమ్మమ్మగారు బొట్లు పెట్టి ఇచ్చిన అరటిపళ్లు రెండు తినేసరికి ఆయాసం

వచ్చింది. ఒకవేళ వూరు చేరే లోపల మళ్లీ అన్నాలు కూడా తినాల్సొస్తుందేమోనని అమ్మనడిగా 'అన్నాలెప్పుడు ఎక్కడ తినాలని!' అందులో తప్పేవిటో నాకయితే తెలియదు. ఇంతెత్తు ఎగిరింది నా మీద - ''ఈ పులిహోర మింగడాన్నే అన్నం తినడం అంటారు! మళ్లీ మళ్లీ కూరలు పులుసులు వేసుకొని ప్రయాణాల్లో ఎవరూ తినరూ ! అసలు మీది కడుపా కండవిల్లి మడుగా!'' అని.

ఆ ముక్కే కాస్త నిమ్మళంగా చెప్తే ఆవిడగారి సొమ్మేం పోయిందో. అన్నిటికీ కేకలెయ్యడమే. చీకటి పడ్డాకమేం చివరికి కూచోకూడదని మమ్మల్ని మధ్యలో కుక్కి అమ్మా నాన్నా చెరో పక్క చివరికి కూచున్నారు. దారంతా ఒకటే చీకటి. జీపులైట్లు పడ్డచోట్ల తుమ్మచెట్లు వెలిగిపోతూ కనిపించడం మళ్లీ చీకటయిపోడం. నాకయితే చాలా భయమేసి కళ్లు మూసేసుకున్నా. కాసేపటికే బహుశా అమ్మే అయివుంటుంది రెక్కచ్చుకు ఈడ్చుకెళ్లింది ఎక్కడికో మరి. నాన్నయితే ఎప్పటికీ అలా చెయ్యనే చెయ్యరు.

ఈ జీపు హారను కూడా వాయించటల్లేదు. కాళ్ల దగ్గిరేవిటీ మెత్తగా. బహుశా ఇందేమో సీట్లోంచి జారి పోయుంటుంది. ఎంతమంచి పూలవాసన వస్తోందీ ! ఏలూరు దారిలో పూల తోట లెక్కువేమో. అబ్బా ఇంకా ఇంకా పరిమళం వచ్చేస్తోంది. బహుశా స్వర్గంలో కొచ్చేశావేమో! లేపోతే ఇంత హాయిగా వుంటుందా! అమ్మా నాన్నా ఏరి ! నెమ్మదిగా కళ్లు తెరిచా.

నా పక్కనే నాన్న మంచం మీద నిద్దరపోతున్నారు. నాన్న గుండెల మీద బుజ్జి నిద్దర పోతోంది. మంచం కింద గోడకి ఆనుకుని చిన్నారి, నా కాళ్ల కింద ఇందు. అందరూ ఒకటే పిచ్చి నిద్దట్లో వున్నారు. అమ్మయితే కనబడలేదు. తల వెనక్కి తిప్పి చూశా !

నా వెనక మూడు పెద్ద కిటికీలు అసలు ఆ గదే బోర్లించిన 'U' లాగా వుంది. ఓ కిటికీలోంచి రాధామనోహరం తీగా ఇంకో కిటికీలోంచి గిన్నె మాలతిపూలూ మూడో కిటికోలోంచి ఇంకేదో తెల్లపూలతో తీగా మూడూ కనిపించాయి. కొన్ని పువ్వులతో వున్న కొమ్మలు గది కిటికీల్లో కొచ్చేశాయి. ఆ తీగలన్నీ కమ్ముల్ని చుట్టేసుకునున్నాయి. వెనక్కి తిరిగి చూస్తే మెడ నెప్పెడుతోందని బోర్లా పడుకుంటే ఎదురుగా ఇంట్లోనే తోట. ఎంత బాగుందో! నేనే పుస్తకాల్లోనూ చదవ లేదు ఇలా చేయచ్చని. ఏలూరు వాళ్లెంత పుణ్యం చేసుకున్నారో కిటికీల్లోకే చెట్లు వాటంతటవే వచ్చేసి పూలు కూడా పూసేస్తున్నాయి. చూసినంతసేపు చూసి ఇక్కడే ఇలా వుంటే పెరట్లో ఇంకా ఎలా వుంటుందోనని చెప్పి లేచి గది తలుపు రెక్కలు నెమ్మదిగా తోశా.

అమ్మప్పుడే స్నానం కూడా చేసేసినట్టుంది. దేవుడ్ని చిన్న బుట్టలో వుంచి వళ్లో

జాగర్తగా పెట్టి తెచ్చుకుంది కదా ! వంటింట్లో పీటవేసి దేవుడ్ని పెడుతోంది. నన్ను చూడగానే 'నానీ! నాలుగంటే నాలుగు పూలు కోసుకురా పెరట్లోకెళ్ళి. ఎక్కువ కోయకు సుమా. బాగుండదు. ఏడింటిలోపల పాలు పొంగించేయాలన్నారు కదా అమ్మమ్మగారు!' అంది. హమ్మ, మొదలయ్యాయి నా డ్యూటీలు. నేకనిపిస్తే చాలు ఈవిడ గారికి ఏదో పని గుర్తొస్తుంది. పందిరి గుంజకు పని చెప్పగలదీవిడ.

నేనింకా హాయిగా గుమ్మం మీద కూచుని పాలెలా పొంగుతాయో చూద్దామనుకున్నా. గుమ్మం బయట కుంపట్లో తెల్లగా మెరిసి పోతున్న ఇత్తడి గిన్నెలో సగానికి పాలు మీగడ కట్టి పొంగడానికి రెడీగా వున్నాయి. అయినా నాలుగు పూలకోసం పెరట్లోకి వెళ్ళక్కర్లేదని అమ్మకి తెలిసినట్లు లేదింకా. నెమ్మదిగా ఆవలించుకుంటూ వెళ్ళి రెండు రాధామనోహరం గుత్తులు రెండు గిన్నెమాలతి గుత్తులు బోల్డు ఆకులతో సహా తెంపుకొని దేవుడి ముందు పళ్ళెంలో పడేసి మళ్ళీ కుంపటి ముందు కూచున్నాను.

''పాలు పొంగేటపుడు దణ్ణం పెట్టుకో అంతేగానీ పొంగిపోతున్నాయి పొంగి పోతున్నాయని అరవకు'' అని నాతో చెప్పి 'సూర్యనారాయణ మూర్తీ తండ్రీ! ఈ పాలు పొంగినట్లు నా సంసారం కూడా పొంగాలి!' అని ఆకాశం కేసి చూసి దణ్ణం పెట్టింది. నన్ను పైకనద్దంది అని వూరుకున్నా గానీ చూస్తూనే వున్నా కనీసం గ్లాసెడు పాలన్నా పోయుంటాయి.

ఇంతట్లోకీ మళ్ళీ ఇంకో ఆర్డరు - ''నువ్వు పోయి నూతి దగ్గిర మొఖం కడుక్కురా, గుమ్మం మీద పొట్లంలో కచికలూ, తాటాకులూ వున్నాయి. కచికలు గానీ తిన్నావంటే ఇంజక్షన్లి ప్పిస్తాను. రెండు నిమిషాల్లో రావాలి!'' కచికలున్నాయనగానే ఒక్క పరుగు పెట్టా! నా దృష్టిలో కచికల కన్నా రుచైన వస్తువు ఈ భూమ్మీదుండదు. అవి తినేస్తున్నానని నా కంట పడనీయకుండా చేసి తియ్యటి ఎర్రటి పళ్ళపొడి తెప్పించేది. అదీ తినేదాన్ననుకో. కాని కచికిలకి ఏదీ సాటి రాదు. నాచేత ఆ అలవాటు మాన్పించాలని పాపం మా నాన్న పెద్దపెద్ద తెల్ల మాత్రలు సీసాలకి సీసాలు తెచ్చేవారు. రోజూ రెండైనా బుగ్గని పెట్టుకోమనేవారు. నాన్న చూస్తుండగా నోట్లో పెట్టుకుని ఆయనటు వెళ్ళగానే సందులో వుమ్మేసేదాన్ని. నాచేత మందులు మింగించడం వీళ్ళ తరమా !

ఒక్కసారి పెరడంతా తిరిగొచ్చాను. ఎంత పెద్దదో. పదెకరాలుంటుందేమో ! పెద్ద బాదం చెట్లు ఉసిరి చెట్లు ఒకటేమిటి అన్ని పళ్లచెట్లూ కనిపించాయి. ఏవీ డబ్బెట్టి కొనుక్కో అక్కర్లేదు. వీళ్లతో మంచిగా వుంటే చాలు. కానీ అన్ని చెట్ల నించీ నేల కనపడకుండా ఆకులు ఎండి రాలిపడుతున్నాయి. నా పాదాలు కూడా కనపడట్లా ! ఏ పామో కుట్టేస్తే ! అమ్మో పరిగెత్తు కుంటూ ఇవతలకొచ్చేశా ! కానీ రెండు పారిజాతం చెట్ల కింద మాత్రం శుభ్రంగా

అలికుంచారు పువ్వు లేరుకోడాని కోసం అనుకుంటా.

అన్ని చెట్లూ బాగానే పెంచారు కానీ జామచెట్టు పెంచడం మాత్రం చేతకాలేదను కుంటా. కొమ్మలన్నీ నేలబారు అడ్డంగా వున్నాయి. కొమ్మకొమ్మకీ చిన్న చిన్న కాయలే. ఎవరైనా అలా పెంచుకుంటారా ? వెధవ పిల్లలుంటారు చూడు ! వాళ్లు చూస్తే బతకనిస్తారా ఇన్నికాయలని ! ఒక్కటి కొరికి చూశా. లోపల గులాబీ రంగులో ఉంది. కానీ నాకస్సలు జాంపళ్లు తినబుద్ధి కాదు. కానీ ఈ చెట్టు ఉయ్యాలూగడానికి మాత్రం బ్రహ్మాండంగా పనికొచ్చేటట్టుంది. ఒక్కో కొమ్మమీద ఏడెనిమిది మందయినా తేలిగ్గా ఎక్కివూగచ్చు. ఒక్కసారి చిన్నవూపు వూగి దిగి కాసిని పారిజాతంపూలు దోసిట్లో పోసుకొని వంటింట్లోకి పరిగెత్తా. దేవుడి కవిప్రీతటగా! అందుకని అలాగే అన్నీ గూట్లోకి జల్లేశాను.

''ఎక్కడికి పోయావే ఇంతసేపూ పాలు చల్లారి పోతున్నాయి. ఇవి తాగేయ్ త్వరగా'' అని పెద్ద గ్లాసోటి ముందు పెట్టింది. కానీ నాకు పాలు చూస్తేనే డోకొస్తుంది. కానీ తప్పదు కదా! కళ్లు మూసుకుని తాగబోతున్నా. ఇంతట్లోకీ పొట్టిగా లావుగా తెల్లగా వున్నావిడ నెత్తి మీద తెల్ల ముసుగేసుకుని ఒక పెద్ద వెండి గిన్నెలో చక్కెర పొంగలి ఇంకో దాంట్లో పులిహోర తెచ్చి గుమ్మంలోకి తోశారు వంటింటి బయటే నిలబడి. ఈ వూళ్లో రోజూ పొద్దున్నే ఇంటి వాళ్లు అన్నీ చేసుకుని అద్దెకున్న వాళ్లకి ఇవ్వాలి కాబోలని విచిత్రంగా చూస్తున్నా.

''అమ్మాయ్ ! ఈవేళ గుళ్లో మన ఆడిటరుగారు ధనుర్మాసం భోగం చేయించారు. ఇవిగో ప్రసాదాలు. పెద్దమ్మగారు ఇందాకా మిమ్మల్ని పలకరిద్దామని వచ్చారు గానీ మీరందరూ వళ్లెరక్కుండా నిద్దర్లోతున్నారు. మళ్లీ వస్తానని చెప్పమన్నారు. ఇప్పుడు ధ్యానంలో కూచున్నారు. తొమ్మిదయితే గానీ బయటికి రారు. ఆ! అన్నట్లు ఈ పూటకి వంట పెట్టుకోవద్దన్నారు. నే మడి కట్టుకోడానికి పోతున్నా. పదకొండయేటప్పటికి వంట పట్టుకొస్తా. మీరీ లోపల ఒక్కొటే సామాన్లు సర్దుకోండి'' అన్నారు.

''మీకెందుకండీ శ్రమ ! నే ఎంత సేపట్లో చేసుకుంటా'' అంది అమ్మ.

''మంచి మాటే ! నే వున్నదే వచ్చిన వాళ్లకి వండి వార్చేందుకు. పూటకి పాతిక మందన్నా అవుతారు. మీ నలుగురూ మాకు బరవవుతారా? సాయంత్రం నించి వండుకుందురు గానీలే!'' అంటూ వెళ్లిపోయారు.

''అమ్మా పదవే. ఇంక నీకు పనేం లేదుగా ! హాయిగా పెరట్లో తిరిగొద్దాం'' అన్నా. 'పని లేకపోడవేవిటి ? పద పద ! ఈ బ్లేడుచ్చుకుని ఒక్కొక్క మూటే ఎక్కడ పురికొస కనిపిస్తే అక్కడ కోస్తూ విప్పుదాం. వీళ్లు లేచే లోపల కొంత పనయినా అవుతుంద''ని మధ్య గదిలోకి నడిచింది. మేం ఇద్దరం కలిసి నాలుగయిదు గోతాలు విప్పామో లేదో ఒక్కొక్కళ్లే లేచారు.

నాన్న గబగబా స్నానం చేసేసి రెడీ అయిపోయారు. అమ్మ పెట్టిన పులిహోర తిని - నిన్నటి కన్నా ఈ వేళ మరీ బాగుందే ! వూరిందేమో అన్నారు. అమ్మ నవ్వి ''ఇది దేవుడి ప్రసాదం నిన్నటి దాంట్లో మిగిలినది కాదు'' అంటూ కాఫీ ఇచ్చింది. కాఫీ కూడా తాగేసి సైటు హాండోవరు చేసుకోవాలి లేటవుతుందని చెప్పి వెళ్లిపోయారు, ఒక్కత్తి ఇల్లెలా సర్దు కుంటుందోనన్న జాలైనా లేకుండా. మేం ఎవ్వరం అమ్మని విసిగించలా. చెప్పినట్లుగా విని అన్నీ ఎక్కడివక్కడ పెట్టాం, ఆఫీసు నుంచి కార్పెంటరొచ్చి మంచాలు బిగించి వెళ్లిపోయాడు. ఇక్కడ అన్ని గదుల్లో పెద్ద పెద్దఅలమారాలున్నాయి. వీధి గదిలో అయితే అద్దాలు కూడా వున్నాయి అలమరకి. ఒక్క బొమ్మ కూడా విరక్కొట్ట కుండా అన్ని బొమ్మలూ వీధి అలమర్లో పెట్టాం. ఆ నల్లపెట్టె వీధి గదిలో కీడ్చుకొచ్చి అమ్మ పువ్వుల చీర కప్పితే చక్కటి సోఫాలాగా అయిపోయింది. ఇంతట్లోకీ ఈ ఇంటి బామ్మగారొచ్చారు. ఆవిడ గుంటూరమ్మమ్మగారికన్నా పెద్దావిడలా వున్నారు. ఆవిడెళ్లి పోయాక అమ్మ అంది 'ఎంతందంగా పచ్చి పసుపు కొమ్ములా పార్వతీదేవిలా ఉన్నార'ని. వాళ్లింట్లో తెల్లారకట్ల తాతగారు ఆంజనేయుడి పూజ చేస్తారట. బామ్మగారు అమ్మతో చెప్పారు. ''ఏం కావాల్సొచ్చినా మొహమాట పడకమ్మా. దేనికీ ఇబ్బంది పడొద్దు. కానీ పిల్లల్ని ఎక్కువగా వీధివైపు మసలనీయద్దు. అబ్బాయి కోసం ఎవరెవరో పెద్ద మనుషులొచ్చి పోతుంటారు'' అని.

''అలాగేనండి. మా పిల్లలు అసలల్లరి చేయరు. వాళ్ల ఆటలేవిటో. వాళ్ల లోకమేవిటో'' అని మా గురించి పాపం చాలా మంచిగా చెప్పింది.

''మీ పెద్దమ్మాయంతే వుంటుంది. మా మనవరాలు సువర్ణనీ! వాళ్లమ్మ చేత జడేయించు కుంటోంది. వస్తుంది'' అని అమ్మతో చెప్పి, ''మీరంతా ఓ జట్టుగా ఆడుకోండేం'' అని నాతో చెప్పి ఆవిడ వెళ్లిపోయారు.

మేం కూడా ఒక్కొక్కళ్లమే మా అమ్మచేత జడ లేయించుకుంటుంటే అప్పు డొచ్చింది ఆ అమ్మాయి. అమ్మే మాట్లాడింది. రా ! పాపా రా ! కూచో అని పీటేసింది. ఎంత బాగుందో! పీట మీద కూచున్నా రెడు జళ్లూ నేలమీద పడిపోయాయి. వెంటనే జడలు ముందుకేసేసు కుంది. వాళ్లమ్మ ఒక్కో జడ గంటయినా దువ్వివేసుంటుంది. లేకపోతే అంత నైసుగా రాకేం. మా అమ్మా వేస్తుంది ఎక్కడ చిక్కక్కడే. ఎప్పుడూ చిక్కు తీయమంటే రేపంటుంది. ఆ పాపకేసి ఇంకో సారి చూశాం. సాటిను పరికిణీ అదేలాటి జాకెట్టు. గోధుం గింజల గొలుసు. చెవులకీ పెద్ద జూకాలు, ఎక్కడికో తయారయినట్లున్నారు. నేనే పలకరించాలి కదా ఏదో ఒకటి. లేకపోతే గర్వమనుకోరూ !

''పెళ్లికెడుతున్నారా?'' అనడిగా !

''ఎక్కడికీ వెళ్లట్లేదు, ఇంట్లోనే!''

''వూరికే ఇంట్లో వుండేందుకు ఇంత మంచి బట్టలా ! ఇలాటివి బయటకెళ్లేటప్పుడే వేసుకోవాలి. పాడయిపోవూ?'' అన్నా.

''మరి ఇంట్లో ఎలాటి వేసుకోవాలి?'' అనడిగింది. అసలేవీ తెలియనట్లుంది.

''ఇవిగో నన్ను చూడు ! ఇంట్లో ఇలా వుతికి ఆరేశాక ఇస్త్రీ చెయ్యకుండా వుంటారే? అలాటివి వేసుకోవాలి తెలిసిందా?''

''అయ్యో నాకు లేవలాటివి. అమ్మ నడుగుతా వెంటనే కొని తెప్పించమని'' లేవ బోయింది.

''ఫరవాలేదులే ఈ వేళ్టికి. జాగర్తగా ఆడుకుంటే సరి. వుయ్యాలూగుదాం రా'' అన్నా.

''అమ్మో తాతగారు ఉయ్యాల బల్లమీద కూచుని వున్నారు. ఇపుడక్కడ వూగుతూంటే కోప్పడతారు'' అని భయపడిపోయింది.

''అయ్యో పిచ్చీ ! వుయ్యాల బల్ల మీద పెద్దవాళ్లు వూగుతారు. పిల్లలు జామచెట్ల మీద వూగుతారు పద పద. మనకి వుయ్యాల బల్లెందుకు' అని లేవదీశా నందరినీ.

''నీ పేరేవిటి! సుశీలా ! నిజంగా నాకు జామచెట్టు మీద వుయ్యాలూగవచ్చునని తెలియనే తెలియదోయ్'' అని నా వెనకాలే వచ్చింది.

ఒక్కళ్లే వుంటే ఇంతే కదా పాపం. సొంత జామ చెట్టుంచుకుని కూడా వుయ్యాలూ గొచ్చునని నే చెప్పే దాకా తనకి తెలియనే లేదు. ఈ అమ్మాయి నే ఎలా చెప్తే అలా వినేట్టే వుంది. ఇంక సెలవులెలా గడపాలా అని బెంగలేదు. ఇప్పుడు నలుగురం కాస్తా అయిదుగురు మయ్యాం కదా !

''అవును ! మా అమ్మని చూశావుగా. మీ అమ్మని చూపించూ'' అన్నా, 'పద' అని బయల్దేరింది. వెనకాలే నలుగురం.

''ఇల్లేరమ్మ తల్లీ ! మంచి ముహూర్తం చూసుకున్నావా ! అరగంటలో వెనక్కొచ్చెయ్యాలి'' అని అమ్మ పాపం ఆశీర్వదించి మరీ పంపింది.